శిథిలావస్థలో వ్యవసాయ కార్యాలయం

- రైతు వేదికలో కొనసాగుతున్న సేవలు
- సరైన భవనం లేక ఇబ్బందుల్లో అన్నదాతలు



రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు (ఫైల్)

మాడ్గుల: వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థలో చేరడంతో వ్యవసాయ శాఖ సేవలు రైతు వేదికలో కొనసాగుతున్నాయి. మాడ్గుల మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థలో ఉండడంతో మూడేళ్లుగా రైతు వేదికలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సరైన భవనం లేక అధికారులతో పాటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణలపై, మరమ్మతులపై దృష్టి సారించకపోవటంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతు వేదికలో సరైన వసతులు లేక అధికారులు, వివిధ పనుల మీద వచ్చే రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ వ్యవసాయ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలకు శ్రీకారం చుట్టింది. అన్ని సౌకర్యాలతో వాటిని నిర్మించగా నేడు వాటి నిర్వహణకు నిధులు లేక అసౌకర్యాల మధ్య అధికారులు తమ విధులను నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు వేదికలో కొనసాగుతున్న వ్యవసాయ శాఖ సేవలు ఇటు సమావేశాలకు వచ్చే రైతులు, వివిధ పనుల నిమిత్తం అక్కడికి వచ్చే ప్రజా ప్రతినిధులు ఎంతో అసౌకర్యానికి గురవుతున్నారు. రైతు భవనంలో కనీస నీటి వసతి లేక పోవడంతో రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 33 గ్రామ పంచాయతీలు ఉన్న మండలంలో రైతులకు సేవలు అందించడానికి సరైన భవనం లేక పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పట్టించుకొని కొత్త భవన నిర్మాణం చేపట్టలని వేడుకుంటున్నారు. మండల కేంద్రానికి ఆయా పనుల నిమ్తిం వచ్చే ప్రజలకి ప్రభుత్వ కార్యాలయాల్లో అసౌకర్యం కలిగించొద్దని నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలమైన భవనాలను తొలగించి వాటి స్థానే నూతన భవనాల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గత నెలలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి కోరారు. మాడ్గుల మండల కేంద్రంలో దాదాపు15ఏళ్ల క్రితం వ్యవసాయ శాఖ కార్యాలయం నిర్మించారాని, ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరిందని వారు వినతి పత్రంలో వివరించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆదిబట్ల రోడ్డును నాలుగులైన్లుగా మార్చాలి

మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల జంక్షన్ ఏరో స్పేస్ మీదుగా నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా మార్చాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీఎస్‌ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. ఆదిబట్ల రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ఈ రోడ్డు మార్గానికి పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రతన్‌టాటా పేరు పెట్టాలని తెలిపారు. టీసీఎస్ ఆవరణంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీనికి విష్ణువర్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారుడికి చెక్కు పంపిణీ చేస్తున్న కిషన్ రెడ్డి

మాడ్గుల: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మాడ్గుల మండల పరిధిలోని కోల్కులపల్లి గ్రామంలో మంగళవారం సంద్రాలగడ్డ తండాకు చెందిన లక్ష్మణ్ నాయక్‌కు మంజూరైన రూ.30వేల చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బట్టు కిషన్ రెడ్డి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్సలు చేయించుకోలేని పేదలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, శ్రీను, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

కడ్తాల్: పేదలకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామంలో స్థానిక నాయకులు బోదాస్ మహేశ్ ఆధ్వర్యంలో, కలాంఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్, మలక్‌పేట్ యశోద ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని యాట నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా యశోద ఆసుపత్రి వైద్య సిబ్బంది 225 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మహేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, రవి, భానుకిరణ్, షాబుద్దీన్, పరుఖ్, రాంరెడ్డి, జాన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీశైలం, మల్లేశ్, మహేశ్, కృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రకటన

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అన్ని ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను పంచాయతీల్లో ప్రకటించారు. అభ్యంతరాలపై అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్ల జాబితాపై తుది జాబితానంతరం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో మంగళవారం పోలింగ్ కేంద్రాలపై ప్రకటన చేశారు. 232 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌లపై కాంగ్రెస్ విమర్శలు తగవు



మాట్లాడుతున్న శ్రీనునాయక్

ఆమనగల్లు: మాజీ సర్పంచ్‌లపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం తగదని జిల్లా సర్పంచుల సంఘం నాయకుడు శ్రీనునాయక్ పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వెంటనే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌ల ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. సర్పంచ్‌ల కృషివల్ల గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా తయారయ్యాయని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, సయ్యద్ ఖలీల్, శంకర్, శివకుమార్, గణేశ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు అందజేస్తున్న ఉప్పల వెంకటేష్, దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చింది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి వైద్య బృందం సౌజన్యంతో మంగళవారం ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. సుమారు 312 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ అఖిల్ వైద్య బృందం పేర్కొన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు జంగయ్య, వీరయ్య, నరేశ్‌గౌడ్, గోపాల్‌గౌడ్, సాబేర్, కోటేశ్, నర్సింహ, ప్రశాంత్, ముచ్చం, మోహన్, కృష్ణ, శంకరయ్య, శ్రీశైలం, తిరుపతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి: దశరథ్‌నాయక్

సంత్ సేవాలాల్ ఆలయ అభివృద్ధికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సహాయ సహకారాలు అందిస్తుందని, ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో సంత్ సేవాలాల్, జగదాంబ మాత ఆలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేజ్ బోరు మోటారును ఆయన ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి రూ.40వేలను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలీ, మాజీ ఎంపీటీసీలు, సాయిలు, ప్రియా రమేశ్, బాబా, ప్రకాశ్, చందు, జగన్ గోపాల్, మల్లేశ్, రాజు, దస్రు, హైదర్, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికే పశుగణన

పశువైద్యాధికారి భానునాయక్



పశుగణనను పరిశీలిస్తున్న భానునాయక్

కడ్తాల్: పశుసంవర్ధక రంగా భవిష్యత్ అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పనకే పశుగణన నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి భానునాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో కొనసాగుతున్న పశుగణన సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భానునాయక్ మాట్లాడారు. పశుగణనతో పశువుల జనాభా, ఆరోగ్యం వంటివి అంచనా వేయొచ్చన్నారు. దీంతో ప్రభుత్వం పాడిపరిశ్రమ అభివృద్ధికి వనరుల కేటాయింపునకు సంబంధించిన విధి విధానాలను రూపొందించొచ్చన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పశువులకు సంబంధించిన డేటా సేకరణ, ఆరోగ్యఅంచనా, బ్రీడింగ్ పద్ధతులు, ఆర్థిక ప్రభావం, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి, వివరాలు సేకరించి, నమోదు చేస్తున్నారన్నారు. పశుగణనకు పాడి రైతులు సహకరించాలని కోరారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ యాదగిరి, సామల రవీందర్‌రెడ్డి తదితరులు

అమెజాన్ కంపెనీ సహకారంతో ఏర్పాటు

ఇబ్రహీంపట్నం రూరల్: అమెజాన్ కంపెనీ సహకారంతో తులేకలాన్ గ్రామంలో నూతన గ్రంథాలయం ఏర్పాటు చేయబోతున్నట్లు మాజీ సర్పంచ్ చిలుకల యాదగిరి, ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అమెజాన్ సంస్థ ప్రతినిధులు తులేకలాన్ గ్రామంలో పర్యటించి స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. అప్పటి తెలంగాణ ఇంటలిజెన్స్ చీఫ్ బత్తుల శివధర్‌రెడ్డిని తులేకలాన్ గ్రామస్తులు కోరడంతో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిక్‌జైన్ ఆదేశాలతో అమెజాన్ కంపెనీతో వారు మాట్లాడినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అనేక మార్లు కృషి చేయడం వల్లే అమెజాన్ ప్రతినిధులు స్పందించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పంచాయతీ కారోబార్, బిల్‌కలెక్టర్లు



ధర్నాలో పంచాయతీ ఉద్యోగులు

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. దీనికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నుంచి కారోబార్‌లు, బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కారోబార్‌లు ఉప్పు రాములు, పెంటయ్య, ఉపేందర్, సురేంద్రపాల్, బాలరాజు, యాదగిరి, కుమార్, శ్రీశైలం, భార్గవ్, శ్రావణ్, జంగయ్యలు మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. రెండో పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకొచ్చి జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ని సవరించడంతో పాటు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలన్నింటినీ కొనసాగించాలన్నారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5లక్షలు చెల్లిస్తూ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆమనగల్లు శాఖ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తం రెడ్డి, కార్యదర్శి ఎంగలి బాలకృష్ణలు కోరారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో మంగళవారం ఆమనగల్లు బ్లాక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం, ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, జేఏసీ నాయకులు పాపిశెట్టి రాములు ముఖ్య అతిథులుగా పాల్గొని విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు తమవంతుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్రాంత పోలీస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఎంఈఓ పాండు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు నారాయణగౌడ్, గుర్రం భద్రయ్య, యాదగిరి, మహాలింగం, విద్యాధర్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

మీర్‌పేట: మీర్‌పేట న్యూగాయత్రీనగర్ ఫేజ్-1లో అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. 20వ డివిజన్‌లోని ఖాళీ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని శ్రీగాయత్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో టీపీఎస్ మంజు భార్గవి సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేయించారు.

నియామకం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు క్యారగారి శ్రీధర్‌ను పార్టీ అధిష్టానం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ చైర్మన్‌గా నియమించింది. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శ్రీధర్‌కు నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకారం అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రి, పార్టీ పెద్దలకు, స్థానిక నాయకులకు శ్రీధర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మీర్‌పేటలో 800 ఇళ్ల సర్వే పూర్తి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ 34వ డివిజన్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లకు 13 వేల 325 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఇప్పటివరకు 800 ఇళ్ల వివరాలను సర్వేలో సేకరించామని తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ చంద్రప్రకాశ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



ఆమనగల్లు: మేడిగడ్డతండాలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మాధురి



కడ్తాల్: చల్లంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుజాత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో ఇందిరమ్మ ఇళ్లసర్వే కొనసాగుతుంది. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ కుసుమమాధురి పరిశీలించారు. ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడ పొరపాట్లకు తావివొద్దని ఎంపీడీఓ సుజాత సూచించారు. మండల పరిధిలోని పెద్దావేములోని బావితండా, చల్లంపల్లి, సాలార్‌పూర్, మక్తమాధారం గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును ఆమె పరిశీలించారు. యాప్ ద్వారా సర్వే చేపట్టిన కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



ఇబ్రహీంపట్నం రూరల్: భూషణ్ గురుస్వామిని సన్మానిస్తున్న కృపేష్, మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి



కడ్తాల్: అయ్యప్పపడిపూజలో నాయకులు భక్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో అయ్యప్ప పడి పూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి బుట్టి భూషణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బుట్టి రాములు హాజరయ్యారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి

కడ్తాల్: సమాజంలో ప్రతిఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శివాలయంలో గురుస్వాములు మహేశ్, రాజు, శ్రీకాంత్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ, ఇరుముడి ధారణ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, లక్ష్మణ్, మహేశ్, భగీరథ్, టిల్లు, శేఖర్, కార్తీక్, వేణు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: మండల పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామంలో ఉదయం అయ్యప్పస్వామి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వాములు పల్లకీ సేవలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. యాచారం మండల కేంద్రంలోని మారోజ్ శ్రీనువాస్‌చారి నివాసంలో అయ్యప్పస్వామి ఇరుముడి, పడిపూజ వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు చందర్‌నాయర్, నారాయణశెట్టి, పురుషోత్తం, కొప్పు భాషాల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని నిరసన



ఇబ్రహీంపట్నం: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



ఆమనగల్లు: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అనురాధ పత్యానాయక్, అర్జున్‌రావ్

ఇబ్రహీంపట్నం: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, నిందితులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిప్రత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడారు. లగచర్లలో భూసేకరణకు అడ్డుతగిలారని నెపంతో అక్రమంగా కేసులు పెట్టి జైళ్లల్లో నిర్బంధించిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృపేశ్, కౌన్సిలర్ ఆకుల యాదగిరి, చిలుక బుగ్గరాములు, అల్వాల వెంకట్‌రెడ్డి, భరత్‌కుమార్, రాజ్‌కుమార్, కర్నె అరవింద్, వీరేష్, భాస్కర్‌రెడ్డి, ప్రేమ్, కరుణాకర్, మహేశ్, గోపాల్, మైసయ్య, అంజయ్య, మహేందర్‌లు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: లగచర్లలో రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, వారిని వెంటనే విడుదల చేయాలని ఆమనగల్లు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్, మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, రమేశ్, వస్పుల సాయిలు, శివకుమార్, సైదులు, రమేశ్, గణేశ్, శంకర్, పరమేశ్, శివ, పంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: ప్రభుత్వం లగచర్ల గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్, కస్నునాయక్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, ప్రియారమేశ్, మంజులచంద్రమౌళి, మహేశ్, పాండు, గోపాల్, రవి, రాజు, అంజి, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మంచాల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చీరాల రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, మాజీ ఎంపీపీ మంకు ఇందిర, అనిత, భద్రినాథ్, వెంకటేశ్, జగన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, విజయ్ కుమార్, అమర్, చిందం జంగయ్య, ప్రశాంత్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.